క్లుప్తంగా

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

బెజ్జూర్: మండలంలోని సలుగుపెల్లి ఎక్స్‌రోడ్ వద్ద బుధవారం మండల బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే సమావేశానికి మహారాష్ట్రలోని చిమూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బంటి భావు బాంగ్డియా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, బూత్ కమిటీ సభ్యులు, మహిళా మోర్చా కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా జమీర్



ఎండీ జమీర్

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్‌ఎస్‌యూఐ ఆసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎండీ జమీర్‌ను నియమించినట్లు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ నర్సింగ్‌రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తానని ఈసందర్భంగా జమీర్ తెలిపారు.

రికార్డులు నమోదు చేయాలి

కెరమెరి: రికార్డులు సరైన విధంగా నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత అన్నారు. మంగళవారం మండలంలోని నాగర్ గోంది, ఉమ్రి, దేవుడ్‌పల్లి, ఇందాపూర్, ఖైరీ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. రికార్డులు నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఆన్‌లైన్ చేసే తీరును కార్యకర్తలకు వివరించారు. ప్రీస్కూల్ యాక్టివిటీస్ చేయాలని, గర్భిణులు, బాలింతలకు సరైన విధంగా సరుకులు ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

కెరమెరి: మండల సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న వీవోఏల సమస్యలు పరిష్కరించాలని వీవోఏల సంఘం నాయకులు ఎంపీపీ పెందోర్ మోతిరాంను కోరారు. మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి వారు మాట్లాడారు. గడిచిన కొన్నేళ్లుగా ఎస్‌హెచ్‌జీ గ్రూపుల బలోపేతానికి కృషి చేస్తున్నామని, రుణాలు ఇప్పించడం, తిరిగి బ్యాంకులకు రుణాలు చెల్లించేలా చేయడం, వివిధ రకాల రికార్డులు రాయడం వంటి పనులు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చాలా తక్కువగా గౌరవ భృతి ఇస్తుందన్నారు. వేతనాలు పెంచేలా, ఈఎఫ్, పీఎఫ్ వంటివి వర్తింపజేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏ మారుతి, సుజాత, రాంచందర్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

వాంకిడి: వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పంచాయతీ సిబ్బంది పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కనర్‌గాం గ్రామ పంచాయతీ కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. విత్తనాలు మొలకెత్తని బ్యాగుల్లో మళ్లీ విత్తనాలు నాటాలని సూచించారు. గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏపీవో శ్రావణ్‌కుమార్, ఈసీ మోసిన్, టీఏ శ్రావణ్, ఎఫ్ఏ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

'మన ఊరు మన బడి' పనుల పరిశీలన

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి, సంజీవనగర్, పెంచికల్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న మన ఊరు మన బడి పనులను మంగళవారం ఏఈ మక్బూల్ పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలలో చేపట్టిన పనుల వివరాలను నమోదు చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు భాగ్యలక్ష్మి, ప్రియాంక, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు పాండు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మండల కమిటీ ఎన్నిక

వాంకిడి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం మండల కమిటీని సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శృతిక, ఉపాధ్యక్షురాలుగా కవిత, రవీందర్, ప్రధాన కార్యదర్శిగా తిరుమల, సహాయ కార్యదర్శులుగా స్వప్న, వెంకటేష్, కోశాధికారిగా శైలజ, అధికార ప్రతినిధిగా దుర్గం సందీప్, సాంస్కృతిక కార్యదర్శులుగా సరస్వతి, దీపిక, సలహాదారులుగా శైలజ, ఉజ్వల, మౌనిక, సభ్యులుగా విజయ్‌బాబు, సునీల్, వెంకటలక్ష్మి, యశ్వంత్, తులసీరాం, సువర్ణ, పార్వతి, చందనలను ఎన్నుకున్నారు.

పల్లెల్లో మూడు ముక్కలాట

- ఇళ్లు గుల్ల చేసుకుంటున్న పేకాటరాయుళ్లు
- ఈ నెలలో 29 మందిపై కేసు నమోదు



కౌటాల: జిల్లాలోని గ్రామాల్లో జోరుగా పేకాట సాగుతోంది. జూదం, మద్యానికి బానిసలైన జల్సారాయుళ్లు రహస్య ప్రదేశాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకొని గుట్టుగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. త్వరగా డబ్బు సంపాదించవచ్చనే అత్యాశతో ఇళ్లను గుల్ల చేసుకుంటున్నారు. అప్పుల బాధలు, కుటుంబ కలహాలతో ఆత్మహత్యలకు పాల్పడి కటుంబాలకు తీరని శోకం మిగుల్చుతున్నారు. పోలీసులు పేకాట శిబిరాలపై దాడులు చేసి పట్టుకుంటున్నా వారి వైఖరిలో మార్పు రావడం లేదు. పోలీసులు ఈ నెలలో 29 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటు రూ.41 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

పంట పొలాల్లో..

జిల్లాలో గత కొద్ది రోజుల నుంచి పోలీసులు నిఘా పెంచడంతో పేకాటరాయుళ్లు పట్టుబడుతున్నారు. పంట పొలాలు, చెరువుల పక్కన పొదలు, రహస్య ప్రదేశాలు, శిథిల భవనాలు, అటవీ ప్రాంతాలు వీరికి అడ్డాలుగా మారాయి. ఇక జిల్లా సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్ర ప్రాంతంలో ఏర్పాటు చేసిన అడ్డాల వద్దకు జిల్లాకు చెందిన పలువురు నిత్యం పేకాట ఆడేందుకు వెళ్తున్నారు. పెద్దమొత్తంలో పేకాటలో డబ్బులు పెట్టేవారు ఎవరికి అనుమానం రాకుండా హోటళ్లు, అటవీప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి పేకాటకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబాలు చిన్నాభిన్నం..

పేకాట ఆడే క్రమంలో వేలాది రూపాయలు పోగొట్టుకొని పలువురు ఆర్థికంగా నష్టపోతున్నారు. పేకాట స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు నగదు స్వాధీనం చేసుకోవడంతోపాటు పట్టుబడ్డ వారిపై ఆయా స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నారు. కేసులు బారిన పడిన యువకులు తమ భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు. పేకాట ఆడుతూ పట్టుబడుతున్న సంఘటనలు జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్నాయి.

ఇటీవల నమోదైన కేసులు..

- ఈ నెల 6న వాంకిడి మండలంలోని ఖమాన గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 6న సిర్పూర్(టి) మండలంలోని పెద్దబండ గ్రామ సమీపంలోని భీమన్న ఆలయం వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 9న కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయ్‌బస్తీ కాలనీ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేకాట రాయుళ్ల వద్ద నుంచి రూ.2,940 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 15న సిర్పూర్(టి) శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 19న కెరమెరి మండలంలోని హట్టి గ్రామంలో పేకాట ఆడుతున్న 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,400 నగదు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, డీఆర్వో కదం సురేశ్‌తో కలిసి మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు పొందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు లేని వారు ఫాం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బూత్‌స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరుగుతూ తమ పరిధిలోని అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల డీటీ జితేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ..

తిర్యాణి: 18 ఏళ్లు నిండిన వారందరిని ఓటరుగా నమోదు చేయించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు చింతపెల్లి గ్రామంలో ఉన్న గిరిజన బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ అనంతరాజు, ఎంపీడీవో మహేందర్ సింగ్, ఎంపీవో జావిద్, సర్పంచ్ ఆత్రం రుక్మిణి, పంచాయతీ కార్యదర్శి గోలేం రాజేశ్, ఆర్ఐ మోహన్ తదితరులు ఉన్నారు.

'అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా'



శ్యాంనాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ నాయకుడు శ్యాం నాయక్ అన్నారు. హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అనంతరం తొలిసారి జిల్లా కేంద్రానికి రాగా ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. జిల్లా కేంద్రంలో మోటార్ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించి టపాసులు పేల్చారు. అంతకుముందు కుమురంభీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చరణ్, ఆసిఫ్, మురళి, మధు, సతీశ్ పాల్గొన్నారు.

శ్యాం నాయక్‌కు ఘన స్వాగతం..

రెబ్బెన: కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుని మొదటిసారిగా మండల కేంద్రానికి వచ్చిన అజ్మీర శ్యాం నాయక్‌కు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్యాం నాయక్‌ను శాలువాతో సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, ప్రధాన కార్యదర్శి దుర్గం దేవాజీ, మాజీ జెడ్పీటీసీ సోమయ్య, దుప్పా నాయక్, వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు



రెబ్బెన: మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకుని మంగళవారం సీతారామాంజనేయ కోలాట బృందం ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు. అనంతరం సీతారాములను దర్శించుకుని స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. కోలాట బృందం సభ్యులు వర లక్ష్మి, భక్తులు శ్యామల, జయశ్రీ, విజయ, పూర్ణిమ, ప్రసన్న, రూప, కామాక్షీ, సావిత్రి, కళావతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 200 మంది విద్యార్థులకు డీఎం శ్రీధర్‌తో కలిసి ఉచిత బస్‌పాస్‌లు అందజేశారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు నగేశ్, శంకర్ పటేల్, నాయకులు తిరుపతి, మారుతి, ప్రశాంత్, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఉన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

రెబ్బెన: విద్యార్థులు ఉన్నతమైన భవిష్యత్తుకు పుస్తక పఠనం ఎంతో ముఖ్యమని లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దొడ్డిపట్ల రవికుమార్ అన్నారు. మంగళవారం రూం టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో రీడింగ్ క్యాంపెయిన్ ర్యాలీని నిర్వహించారు. సీఆర్‌పీ దేవేందర్, ఉపాధ్యాయులు సాయికృష్ణ, రూం టూ రీడ్ బ్యాక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు 'ఉపాధి' ప్రజావేదిక

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 24న ఉదయం 9 గంటలకు ఉపాధిహామీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2021 నుంచి మార్చి 31, 2023 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద నిర్వహించిన పనులపై తనిఖీ బృందం ఆధ్వర్యంలో 11వ విడత ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్‌ఎంపీపీతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధిహామీ పథకంలో పని చేసిన కూలీలు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉపయోగకరం

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉన్నతి శిక్షణ కార్యక్రమం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉన్నతి అభ్యసనాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు, ఎస్‌వోలు శ్రీనివాస్, సుభాష్, స్వర్ణ, వెంకటేశ్వరస్వామి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బంటి బాంగ్డియా

దహెగాం(సిర్పూర్): జిల్లాలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మహారాష్ట్రలోని చిమూర్ ఎమ్మెల్యే బంటి బాంగ్డియా అన్నారు. దహెగాంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ ప్రవాస్ యోజన అసెంబ్లీ స్థాయి సమావేశానికి హాజరయ్యారు. ముందుగా మండల కేంద్రంలోని అంబేద్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సిర్పూర్(టి) నియోజకవర్గం రాష్ట్రంలో నంబర్ వన్ ఉన్నా అభివృద్ధిలో మాత్రం చివరి స్థానంలో ఉందన్నారు. దహెగాం నుంచే మార్పు ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. ఓబీసీ మోర్చా మీడియా కన్వీనర్‌గా తుమ్మిడె సురేశ్ నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు, సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిగౌడ్, సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి సురేశ్, కోశాధికారి వీరభద్రచారి, నాయకులు వెంకటేశ్, జయలక్ష్మి, నారాయణ, దామోదర్, సురేశ్, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

రెబ్బెన: ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి సామిత్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయటం, సమాన పనికి సమాన వేతనం అందించటంతో పాటు ఇతర డిమాండ్ల సాధన కోసం ఈనెల 31 నుంచి సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, రూప్సీ, వనిత, మృదుల్ మండల్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

తిర్యాణి: వైద్యశాఖ ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం జిల్లా ఇన్‌చార్జి సదానందం అన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 31 నుంచి నిర్వహించే సమ్మె నోటీసును మంగళవారం గిన్నెదరి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మెహిరిన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు దశరథ్, భారతి తదితరులు ఉన్నారు.

బాబా జయంతి విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జైనూర్: శ్రీ పూలాజీ బాబా 99వ జయంతిని భక్తులు విజయవంతం చేయాలని సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని పట్నపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్‌లో జయంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న శ్రీ పూలాజీ బాబా జయంతిని అధికారంగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ శోభబాయి, కమిటీ సభ్యులు సుభాశ్, దాదారావు, కైలాస్, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మండల కేంద్రానికి చెందిన యువకులు బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ ఉద్యోగాలు సాధించడంతో వారిని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన యువకులు పిడుగు మణికంఠ(సీఐఎస్ఎఫ్), గజ్జెల అక్షయ్(బీఎస్ఎఫ్), సాయి(సీఐఎస్ఎఫ్), ఉమెర్(బీఎస్ఎఫ్)లు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సంఘం జిల్లా నాయకులు మిట్ట తిరుపతి, ఆశన్న, వెంకటేశం, గణపతి, సతీష్‌కుమార్, గోపాల్, పోషన్న, తిరుపతి, చైతన్య, హరిప్రియ, సువర్ణ, మంజుల, సునీత, వాణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కల్యాణలక్ష్మి' ఆన్‌లైన్ పనులు



ఆన్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మహేందర్

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 4153 దరఖాస్తులు అందగా, 2440 దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించారు. ఓటర్ ఐడీ గుర్తింపు కార్డు లేకపోవడం, భర్త ఆధార్‌కార్డును జత చేయకపోవడం తదితర కారణాలతో 40 దరఖాస్తులు తిరస్కరించినట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు. ఇప్పటికీ 1502 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశామని, మిగిలిన వాటిని నేడు పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

పీజీ ప్రవేశపరీక్షలో విద్యార్థుల ప్రతిభ

కాగజ్‌నగర్‌టౌన్: పీజీ ప్రవేశపరీక్షలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం తెలిపారు. పీజీ ఎంట్రెన్స్‌లలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించి ఆయా విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో సీట్లు సాధించినట్లు పేర్కొన్నారు. కళాశాలకు చెందిన కొస్నం శ్రావణి వృక్ష శాస్త్ర విభాగంలో 242వ ర్యాంక్ సాధించగా, తాటి శ్రీకాంత్ కామర్స్ విభాగంలో 343వ ర్యాంక్, కొరేత మౌనిక వృక్ష శాస్త్ర విభాగంలో 797వ ర్యాంక్, చాప్లే బికారు రసాయన శాస్త్రంలో 1373వ ర్యాంక్‌లు సాధించారు.

సంక్షిప్త వార్తలు

మద్దతు ప్రకటించాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: 2వ ఏఎన్‌ఎంలు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించాలని మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలోని డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ ఏఎన్‌ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షుడు సంతోషి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు భాగ్య, ప్రచార కార్యదర్శి భూదేవి, నాయకులు ప్రమీల, సునీత, పద్మ, రాజేశ్వరి, తిరుమల మంగ, లీల, కవిత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి' వర్తింపజేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: గృహలక్ష్మి పథకం అర్హులందరికీ వర్తింపజేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎం.ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ జోక్యం లేకుండా మొదటి విడతలో అర్హులైన పేదలకు గృహలక్ష్మి పథకం మంజూరు చేసి ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. నామమాత్రంగా సర్వే నిర్వహించి సర్పంచులు, అధికార పార్టీ నాయకుల ద్వారా లబ్ధిదారుల జాబితా తయారు చేయడం సరికాదన్నారు. అధికారుల సర్వే ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక జరగాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ టికెట్ ఖరారు చేయడంతో బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో బాణసంచాలు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. జెడ్పీటీసీ పంద్రం పుష్పలత మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సైతం కోనేరు కోనప్పనే భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సకారాం, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, వెంకన్న, ఇస్తారి, నరేందర్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

'తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం'

కాగజ్‌నగర్‌టౌన్: ఫేస్‌బుక్‌లో ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేసిన స్థానిక సౌగాం బస్తీకి చెందిన సత్యనారాయణపై మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి గోరంట్ల సంతోష్ పేర్కొన్నారు. సీఐ బుద్దేస్వామి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం పెట్టే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో లలిత్ బలోత్ర ఉన్నారు.

శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి

రెబ్బెన: హన్మకొండలో జరిగే భారత ప్రజాతంత్ర యువజన సమైఖ్య రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి చాపిడి శివ, మండల నాయకులు కృష్ణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఉపాధి' గ్రామసభలు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో ఈ నెల 17 నుంచి కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం గ్రామసభలు మంగళవారం ముగిశాయి. ఆయా గ్రామసభల్లో జాబ్‌కార్డులు లేకపోవడం, చేసిన పనుల కొలతల్లో వ్యత్యాసం రావడం, నివేదికల్లో ఉన్న మొక్కలకు క్షేత్రస్థాయిలో ఉన్న మొక్కలకు తేడాలు ఉండడాన్ని గుర్తించారు. ఎక్కడెక్కడ ఎలాంటి పనులు జరిగాయి.. ఎంత మంది కూలీలు పని చేశారు.. అనే విషయాలను తెలియజేశారు. ఏపీవో మల్లయ్య, ఎస్సీఆర్‌పీలు, డీఆర్‌పీలు, టీఏలు, ఎఫ్‌ఏలు, సిబ్బంది ఉన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

కౌటాల: పశు సంపదను పెంచి పశుపోషకులు ఆర్థికంగా వృద్ధి చెందాలని పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ 3, 4 నెలల వయస్సు పైబడిన ఆవు, గేదె జాతి పశువులకు టీకాలు వేయించాలన్నారు. సర్పంచ్ ఆదే శ్రీనివాస్, సిబ్బంది కోట శ్రీనివాస్, సందీప్, రాజన్న, భిక్షపతి, శోభన్, స్రవంతి పాల్గొన్నారు.

పేదల కోసమే సంక్షేమ పథకాలు

వాంకిడి: పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకొస్తుందని ఎంపీపీ ముండె విమలబాయి, జెడ్పీటీసీ అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. తహసీల్దార్ రహీముద్దీన్, డీటీ శ్రావణ్‌కుమార్, పెంటు, సర్పంచులు అయ్యూబ్, దేవ్‌రావు, తుకారాం, జంగు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలి

వాంకిడి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు సత్తా చాటాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ అన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి మండలంలోని ఖిరిడి గ్రామంలో ఆయన పర్యటించారు. మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ కుమార్, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

చింతలమానెపల్లి: మండల బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి జుమిడి సాగర్ పార్టీ పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు డుబ్బుల వెంకన్నకు యన రాజీనామా పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ : తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899